

PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీతూట
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

బుధవారం 11 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి: 02 . సంచిక : 161 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



డీఎస్పీల పనితీరుతోనే రాష్ట్ర ప్రతిష్ఠ పెరుగుతుంది.. ప్రజల నమ్మకాన్ని నిలబెడుతూ నిబద్ధత, నిజాయితీతో విధులు నిర్వర్తించాలి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నవంబర్ 11 (నందేశం టైమ్స్ – హైదరాబాద్): పోలీసు శాఖలో నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న ప్రొబేషనరీ డీఎస్పీలు నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పది మంది డీఎస్పీలు అరాచకంగా వ్యవహరిస్తే రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, అవినీతి పెరిగిపోయిందని ప్రభుత్వంపై ఆరోపణలు వస్తాయని, అదే పది మంది అధికారులు నిటారుగా నిలబడి నిబద్ధతతో పనిచేస్తే పది రాష్ట్రాల్లో తెలంగాణ ప్రతిష్ఠ పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ)లో కొత్తగా ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్న ప్రొబేషనరీ డీఎస్పీల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా శిక్షణ సమయంలో ట్రైనీ అధికారులు తీసుకున్న ఫొటోల ప్రదర్శనను తిలకించి, 'క్రైమ్ సీన్ ఫొరెన్సిక్స్' హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసు అధికారులుగా కొత్త బాధ్యతలు చేపట్టినప్పటికీ తాము వచ్చిన సామాజిక, ఆర్థిక నేపథ్యాన్ని ఎప్పటికీ మరిచిపోవద్దని సూచించారు. తమ నేపథ్యాన్ని మరిచిపోయిన రోజు తమ హోదాకు న్యాయం చేయలేరని, ప్రత్యేక లక్ష్యంతో కష్టపడి ఈ స్థాయికి చేరుకున్న ప్రతి ఒక్కరూ ప్రజాసేవే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగాలని అన్నారు. లక్ష్య సాధనలో ఇది మొదటి అధ్యాయం మాత్రమేనని, ఇకపై ప్రారంభమయ్యేది అసలైన బాధ్యతలతో కూడిన రెండో అధ్యాయమని వివరించారు. పోలీసు వ్యవస్థలో క్షేత్రస్థాయిలో ప్రజలతో నేరుగా మమేకమై పనిచేసే బాధ్యత డీఎస్పీలపైనే ఎక్కువగా ఉంటుందని, వారి పనితీరే ప్రభుత్వానికి గీటురాయిగా మారుతుందని పేర్కొన్నారు. సామాన్యుడి నుంచి ఉన్నతస్థాయి వ్యక్తుల వరకు ఏ సమస్య వచ్చినా ముందుగా పోలీసులనే ఆశ్రయిస్తారని, దశాబ్దాలుగా పోలీసు అధికారులు, సిబ్బంది చేసిన సేవలు, త్యాగాల వల్లే ప్రజల్లో పోలీసు శాఖకు గౌరవం ఏర్పడిందని గుర్తుచేశారు. ఆ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత నూతన అధికారులపై ఉందన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికగా విని, వారి పరిస్థితులను అర్థం చేసుకోవాలని, సమస్యను పూర్తిగా అర్థం చేసుకుంటే పరిష్కారంలో సగం విజయం సాధించినట్లేనని సూచించారు. సమస్యల పరిష్కారానికి సమయం, వనరులు, సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం కూడా మారుతోందని, గతంలో దొంగసారా, ఇతర అక్రమ కార్యకలాపాలు ప్రధాన సవాళ్లుగా ఉండేవని, ప్రస్తుతం కొకైన్, హెరాయిన్, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా సమాజానికి పెను ప్రమాదంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ వ్యవహారాల్లో ఎంతటి వారున్నా ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తూ ప్రభుత్వం ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ సమస్యలు, ఆహార కల్తీ, మాదకద్రవ్యాల నియంత్రణ వంటి కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేక నైపుణ్యాలు, స్పష్టమైన విధానాలు అవసరమని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరగాళ్లు ఎక్కడో ఉండి మొబైల్ ఫోన్ల ద్వారా ప్రజల ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నారని, ఇలాంటి నేరాలను అరికట్టేందుకు పోలీసు అధికారులు నిరంతరం తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. పోలీసు శాఖలో ఇప్పటికే సీఐడీ, ఏసీబీ, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ వంటి ప్రత్యేక విభాగాలు ఉన్నాయని, నూతన డీఎస్పీలు తమ ఆసక్తి, నైపుణ్యాలకు అనుగుణంగా ప్రత్యేక విభాగాలను ఎంచుకుని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు. అవసరమైతే దేశంలోని ప్రముఖ సంస్థల్లోనే కాకుండా విదేశాల్లోనూ ప్రత్యేక శిక్షణ అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. పోలీసు శాఖలో అవుట్‌సోర్సింగ్‌పై ఆధారపడటం కంటే అంతర్గత సామర్థ్యాలను పెంపొందించుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు. అనంతరం గ్రూప్-1 నియామకాలపై మాట్లాడుతూ అత్యంత సంక్లిష్ట పరిస్థితుల్లోనూ నియామక ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2011లో గ్రూప్-1 నియామకాలు చేపట్టిన తర్వాత దాదాపు 13 ఏళ్ల పాటు తెలంగాణలో ఈ స్థాయి నియామకాలు జరగలేదని, యువత ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న సమయంలో నియామకాల్లో జాప్యం జరగడం వారి భవిష్యత్తుపై ప్రభావం చూపిందని అన్నారు. గతంలో ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణలు, నియామక ప్రక్రియలో తలెత్తిన గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి, యూపీఎస్సీ విధానాలను అధ్యయనం చేసి అనుభవం, నైపుణ్యం, చిత్తశుద్ధి కలిగిన వారిని నియమించామని వివరించారు. మొత్తం 563 గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా 562 మంది అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరారని, వారిలో 112 మంది డీఎస్పీలుగా నియమితులవడం గొప్ప విజయమని పేర్కొన్నారు. నియామక ప్రక్రియలో పారదర్శకతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ వైస్ చైర్‌పర్సన్, డైరెక్టర్ జనరల్ శాంతికుమారి, హోంశాఖ కార్యదర్శి శిఖా గోయల్, రాష్ట్ర భద్రతా సలహాదారు బి. శివధర్ రెడ్డి, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శిక్షణలో వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు ట్రైనీ డీఎస్పీలకు ముఖ్యమంత్రి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ న్యాయం, నిజాయితీ, నిబద్ధతకు మారుపేరుగా పోలీసు వ్యవస్థను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులకు దిశానిర్దేశం చేశారు.

సమాజం కోసం సాగిన ప్రయాణంలో రెండు హృదయాల త్యాగం.. పవన్ కల్యాణ్ – అన్నా కొణిదెల విడిపోవాలన్న నిర్ణయం కలచివేసినా.. ప్రజాసేవలో వారి పాత్ర చిరస్మరణీయం!



నవంబర్ 11 (నందేశం టైమ్స్ ప్రత్యేక కథనం): పవన్ కల్యాణ్, అన్నా కొణిదెల విడిపోవాలనే నిర్ణయం వెలువడిందన్న వార్త అభిమానులతో పాటు సామాన్య ప్రజల హృదయాలను సైతం కలచివేస్తోంది. 13 ఏళ్ల వైవాహిక ప్రయాణానికి పరస్పర అవగాహన, గౌరవంతో ముగింపు పలకాలని ఇద్దరూ సంయుక్తంగా ప్రకటించడం వ్యక్తిగతంగా వారి జీవితాల్లో ఒక కీలక మలుపు కాగా, సమాజం కోసం నిరంతరం శ్రమించే ఒక ప్రజానాయకుడి జీవితంలోని వ్యక్తిగత కోణాన్ని మరోసారి చర్చకు తీసుకొచ్చింది. పవన్ కల్యాణ్ జీవితం కేవలం నటుడిగా, రాజకీయ నాయకుడిగా మాత్రమే కాకుండా ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించే వ్యక్తిగా సాగుతోంది. పూల పాన్పులా ప్రశాంతంగా సాగాల్సిన జీవితాన్ని ప్రజాజీవితంలోకి అడుగుపెట్టి ఎన్నో నవాళ్లు, విమర్శలు, ఒడిదుడుకులతో కూడిన ముళ్లబాటగా మార్చుకున్న వ్యక్తిగా ఆయన అభిమానులు భావిస్తారు. రాజకీయాలను కేవలం అధికారానికి, ఆర్థిక ప్రయోజనాలకు పరిమితం చేసుకోకుండా ప్రజల సమస్యలు, రైతుల కష్టాలు, పేదల బాధలు, అణగారిన వర్గాల సంక్షేమం వంటి అంశాలపై తనదైన శైలిలో స్పందిస్తూ ముందుకు సాగుతున్న నాయకుడిగా పవన్ కల్యాణ్ గుర్తింపు పొందారు. ఇంట్లో ఉన్నా, కార్యాలయంలో ఉన్నా, ప్రజల్లో ఉన్నా తనను కలిసే ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలనే తపన ఒక ప్రజాప్రతినిధిలో ఉండాల్సిన బాధ్యతను గుర్తుచేస్తుంది. మరోవైపు ఆయన జీవిత భాగస్వామిగా ప్రయాణించిన అన్నా కొణిదెల సైతం తనదైన వ్యక్తిగత జీవితాన్ని పక్కనపెట్టి ప్రజాజీవితంలో ఉన్న నాయకుడి కుటుంబ బాధ్యతలను పంచుకున్న వ్యక్తిగా అభిమానుల దృష్టిలో నిలిచారు. విదేశీ నేపథ్యం నుంచి భారతీయ కుటుంబంలోకి అడుగుపెట్టి, ఇద్దరు పిల్లలకు తల్లిగా కుటుంబ జీవితాన్ని కొనసాగించిన ఆమె ప్రయాణం కూడా ప్రత్యేకమైనదే. ఒకవైపు కోట్లాది మంది ప్రజలను తన కుటుంబంగా భావించి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించాల్సిన ప్రజానాయకుడి బాధ్యతలు, మరోవైపు కుటుంబ సభ్యులతో గడపాల్సిన వ్యక్తిగత సమయం, భార్యాభర్తల మధ్య ఉండాల్సిన అనుబంధం, పిల్లల పట్ల తల్లిదండ్రుల బాధ్యతలు.. ఇవన్నీ ఒక వ్యక్తి జీవితంలో సమతుల్యత సాధించడం ఎంత కష్టమో ఈ పరిణామం మరోసారి ఆలోచింపజేస్తోంది. అయితే వారి వ్యక్తిగత నిర్ణయానికి గల కారణాలపై ఎలాంటి ఊహాగానాలకు తావివ్వకుండా, ఇద్దరూ ప్రకటించిన పరస్పర గౌరవం, అవగాహనను గౌరవించాల్సిన బాధ్యత సమాజంపై ఉంది. తమ వైవాహిక బంధం ముగిసినప్పటికీ మంచి స్నేహితులుగా, పిల్లలకు అంకితభావంతో కూడిన తల్లిదండ్రులుగా కొనసాగుతామని, వారి సంతోషం, సంక్షేమమే తమ ఉమ్మడి ప్రాధాన్యమని ఇద్దరూ స్పష్టం చేయడం అభినందనీయం. వ్యక్తిగత జీవితంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకున్నా ప్రజాసేవ పట్ల నిబద్ధత, సమాజం పట్ల బాధ్యత, మానవత్వం వంటి విలువలు మాత్రం కొనసాగాలని ఆశిద్దాం. ఒకరి జీవితంలో మరొకరు పంచుకున్న అనుభవాలు, జ్ఞాపకాలు, బాధ్యతలు ఎప్పటికీ చెరిగిపోవు. వారి నిర్ణయాన్ని గౌరవిస్తూ, పిల్లల భవిష్యత్తు సంతోషంగా ఉండాలని కోరుకుంటూ, పవన్ కల్యాణ్ ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి చేరాలని, అన్నా కొణిదెల తన జీవితంలో ప్రశాంతత, ఆనందాన్ని పొందాలని ఆకాంక్షిద్దాం. చివరికి వ్యక్తిగత బంధాల పరిణామాలు ఎలా ఉన్నా సమాజానికి చేసిన సేవ, ప్రజల జీవితాల్లో తీసుకొచ్చిన సానుకూల మార్పులే ఒక వ్యక్తి చిరస్థాయిగా గుర్తుండిపోయేలా చేస్తాయి. ఇద్దరి భవిష్యత్తు ప్రయాణం గౌరవప్రదంగా, సంతోషంగా సాగాలని కోరుకుందాం.

తెలంగాణ ఆత్మగౌరవానికి అక్షర రూపం అందెశ్రీ.. ఆయన సాహిత్యం తరతరాలకు ఉద్యమ స్ఫూర్తి: సీఎం రేవంత్ రెడ్డి




నవంబర్ 11 (నందేశం టైమ్స్ – హైదరాబాద్): తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం తన కలాన్ని ఆయుధంగా, గళాన్ని ఉద్యమ శంఖారావంగా మలిచిన ప్రజాకవి స్వర్గీయ అందెశ్రీ సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కొనియాడారు. ప్రజాకవి అందెశ్రీ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ నేల గొప్పతనాన్ని, ఇక్కడి ప్రజల జీవన విధానాన్ని, భాషా సంస్కృతులను, సంప్రదాయాలను తన సాహిత్యం ద్వారా ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడిగా అందెశ్రీని స్మరించుకున్నారు. కవిగా, రచయితగా, విమర్శకుడిగా, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాతగా ఆయన అందించిన సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలో అందెశ్రీ రచనలు ప్రజల్లో చైతన్యాన్ని రగిలించాయని, ఆయన పాటలు ఉద్యమకారుల్లో పోరాట స్ఫూర్తిని నింపాయని గుర్తుచేశారు. ముఖ్యంగా 'జయ జయహే తెలంగాణ జనని జయకేతనం' గీతం తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు, ఈ ప్రాంత చరిత్రకు, సంస్కృతికి ప్రతిబింబంగా నిలిచిందని కొనియాడారు. కోట్లాది మంది తెలంగాణ ప్రజల హృదయాల్లో ఆ గీతం ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని, రాష్ట్ర గీతంగా గుర్తింపు పొందడం ద్వారా అందెశ్రీ సాహిత్య ప్రతిభకు సముచిత గౌరవం లభించిందని పేర్కొన్నారు. ఆయన కలం నుంచి వెలువడిన ప్రతి అక్షరం తెలంగాణ చరిత్రను, ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. కేవలం పాటలు రాసిన కవిగా కాకుండా తన రచనలతో సమాజాన్ని ఆలోచింపజేసిన ప్రజా ఉద్యమకారుడిగా అందెశ్రీ నిలిచిపోయారని తెలిపారు. తెలంగాణ నేలపై ఆధిపత్యం, అన్యాయాలపై తన సాహిత్యంతో ప్రశ్నించిన ఆయన భావజాలం రాబోయే తరాలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నంతకాలం అందెశ్రీ పేరు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన ఆ మహాకవి ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొంటూ ఘనంగా జోహార్లు అర్పించారు.

సంక్షేమం నుంచి అభివృద్ధి వరకు.. ఆంధ్రప్రదేశ్‌ను ప్రగతి పథంలో నడిపించే దిశగా చంద్రబాబు అడుగులు

అమరావతి నిర్మాణం, భారీ పెట్టుబడులు, మహిళా సాధికారత, రైతు సంక్షేమానికి ప్రాధాన్యం





నవంబర్ 11 (నందేశం టైమ్స్ – అమరావతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారిశ్రామిక పెట్టుబడులు, ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ పాలనను ముందుకు తీసుకెళ్తున్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎన్నికల హామీల్లో భాగంగా ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, అమరావతిని ఆధునిక రాజధానిగా తీర్చిదిద్దడం, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం వంటి కీలక లక్ష్యాలపై దృష్టి సారించారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు పెద్దపీట వేస్తూ ఉచిత బస్సు ప్రయాణం కోసం 'స్త్రీ శక్తి' పథకాన్ని అమలు చేస్తున్నారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఆర్థిక సహాయం జమ చేస్తూ పిల్లల విద్యపై ప్రోత్సాహం అందిస్తున్నారు. 'దీపం-2.0' పథకం కింద అర్హులైన కుటుంబాలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నారు. రైతుల సంక్షేమం కోసం 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా అర్హులైన రైతులకు కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ నిధులతో కలిపి ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన వర్గాలకు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల ద్వారా ఆర్థిక అండ కల్పిస్తున్నారు. పేదలకు తక్కువ ధరకు భోజనం అందించేందుకు అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి విస్తరిస్తున్నారు. మత్స్యకారులు, చేనేత కార్మికులు, ఆటో డ్రైవర్లు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లోనూ ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు, పోలీసు కానిస్టేబుళ్ల నియామకాలు చేపట్టడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు పరిశ్రమలు, ఐటీ సంస్థలను రాష్ట్రానికి ఆకర్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు, ఇతర ప్రభుత్వ భవనాలు, రహదారులు, తాగునీరు, మురుగునీటి వ్యవస్థలు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేస్తున్నారు. అమరావతిని కేవలం పరిపాలనా కేంద్రంగానే కాకుండా పెట్టుబడులు, విద్య, సాంకేతిక పరిజ్ఞానం, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో క్వాంటమ్ వ్యాలీ, ఏఐ, సెమికండక్టర్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడంతో పాటు రాయలసీమ ప్రాంతానికి సాగునీటి సౌకర్యాలు కల్పించడం, హంద్రీనీవా వంటి సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నారు. విశాఖపట్నం, తిరుపతి, అమరావతి ప్రాంతాలను వేర్వేరు ఆర్థిక అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దే ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పారిశ్రామిక రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు పలు కొత్త విధానాలను తీసుకొస్తున్నారు. 2026 నవంబర్ 10న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఏఐ డేటా సెంటర్లు, రోబోటిక్స్, సెమికండక్టర్లు, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలకు సంబంధించిన విధానాలకు ఆమోదం తెలిపారు. విశాఖపట్నం, అనకాపల్లి, తిరుపతి తదితర ప్రాంతాల్లో భారీ పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. వీటిలో కొన్ని ప్రాజెక్టులు అమలుకు సిద్ధమవుతుండగా, మరికొన్ని పెట్టుబడి ప్రతిపాదనల దశలో ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో రహదారులు, ఫ్లైఓవర్లు, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధికి రూ.7,469 కోట్లకు పైగా మౌలిక సదుపాయాల కార్యక్రమానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మరోవైపు పేదరిక నిర్మూలన, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళా సంఘాల బలోపేతం, వ్యవసాయ ఆధునికీకరణ వంటి అంశాలపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. 2025లో రాష్ట్ర ఆర్థిక వృద్ధి 11.28 శాతంగా నమోదైనట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. సంక్షేమ పథకాలతో పాటు దీర్ఘకాలిక అభివృద్ధి ప్రాజెక్టులకు నిధులు కేటాయించడం ద్వారా రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అయితే ప్రకటించిన పెట్టుబడులు వాస్తవ ప్రాజెక్టులుగా రూపుదిద్దుకుని, స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించడం, సాగునీటి ప్రాజెక్టులు పూర్తికావడం, రాజధాని నిర్మాణం నిర్దేశిత గడువుల్లో పూర్తిచేయడం వంటి అంశాలు ప్రభుత్వానికి కీలక సవాళ్లుగా నిలుస్తున్నాయి. ప్రజలకు అందించే సంక్షేమ ఫలాలు, అభివృద్ధి పనుల పురోగతి, పారదర్శక పాలన ఆధారంగానే ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయం మరింత స్పష్టమవుతుంది. మొత్తంగా సంక్షేమం, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, సాంకేతిక అభివృద్ధిని సమన్వయం చేస్తూ ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు చంద్రబాబు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు రాష్ట్ర రాజకీయ, ఆర్థిక రంగాల్లో ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి.



స్వచ్ఛ భారత్ కార్యక్రమాల అమలులో వేగం పెంచాలి.. పెండింగ్ పనులను గడువులోగా పూర్తి చేయాలి: అధికారులకు డైరెక్టర్ సురేష్ బాబు ఆదేశాలు

నవంబర్ 11 (సందేశం టైమ్స్ – సూర్యాపేట): జిల్లాలో స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) కార్యక్రమాల అమలులో వేగం పెంచి, పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) డైరెక్టర్ సురేష్ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మునగాల మండలంలోని బరాఖత్ గూడెం గ్రామ పంచాయతీని ఆయన సందర్శించి, గ్రామంలో వివిధ స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాల అమలు తీరు, పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సూర్యాపేట కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. హరిసింగ్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలోని అన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు), మండల పంచాయతీ అధికారులు (ఎంపీవోలు), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, VB-G RAM G కంప్యూటర్ ఆపరేటర్లతో వివిధ కార్యక్రమాల పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి వ్యక్తిగత గృహ మరుగుదొడ్ల నిర్మాణం (ఐహెచ్‌హెచ్‌ఎల్), వీఓలు, స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సమాఖ్య భవనాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు, పబ్లిక్ కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల ఏర్పాటు, ఎస్‌ఈఈఈపీసీ సర్వే డేటా పరిశీలన, ధృవీకరణ, డ్రైయిన్ ఎండ్ సోక్ పిట్ల నిర్మాణం, ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా వ్యర్థాల వేరు చేసే షెడ్ల నిర్మాణం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. ఆయా కార్యక్రమాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, పనుల పురోగతిలో ఉన్న లోపాలను అధికారులు వివరించగా, వాటిని అధిగమించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని డైరెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, లక్ష్య సాధనలో నిర్లక్ష్యం వహించకుండా సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్‌డీఓ పీడీ సన్యాసయ్య, జెడ్పీ సీఈవో శిరీష, డీపీఓ యాదగిరి, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఇంట్రా గ్రిడ్ అధికారులు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్, స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) ఐఈసీ, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాలు కొబ్బరికాయలకే పరిమితమా? నత్తనడకన వరి ధాన్యం కొనుగోళ్లు..!

ఆందోల్, నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రబీ సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యం చేతికొచ్చి నెలరోజులు గడుస్తున్నా గ్రామాల్లో ఇప్పటివరకు తూకాలు ప్రారంభం కాకపోవడంపై సీపీఎం ఆందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పేరుకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం కొనుగోళ్లు చేపట్టకుండా వదిలేశారని, కొనుగోలు కేంద్రాలు కొబ్బరికాయలకే పరిమితమయ్యాయా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవక వేసిన పంటలు ఎండిపోయాయని, కొన్ని గ్రామాల్లో పంట చేతికొచ్చి నెలరోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేసి తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని అన్నారు. ఒకవైపు పంటలు పండక రైతులు నష్టపోతుంటే, మరోవైపు చేతికొచ్చిన పంటను అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో రైతులు తమ ధాన్యాన్ని ఎక్కడ విక్రయించాలో తెలియక దళారులను ఆశ్రయించి మోసపోతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి తోడు దళారులు కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎండిపోయిన పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం అందించాలని కోరారు. రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే రైతాంగం పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏరియా కమిటీ సభ్యులు మహేష్, ప్రభాకర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.



ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి.. లేదంటే డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మె

ఎమ్మెల్యే కార్యాలయానికి వినతిపత్రం అందజేత.. ----సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు

నర్సాపూర్ నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు హెచ్చరించారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కార్యాలయానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కడారి నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలులో నిరంతరం శ్రమిస్తున్నప్పటికీ వారికి తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత, కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, రూ.50 లక్షల జీవిత బీమా, అంత్యక్రియల ఖర్చుల కింద రూ.50 వేలు, రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. పారితోషికంలో సగం పెన్షన్‌గా చెల్లించాలని, ప్రతి ఆదివారం, ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ లీవులు కల్పించాలని, ఏఎన్ఎం, జీఎన్ఎం శిక్షణ పొందిన ఆశా వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని అన్నారు. రెండో పీఆర్సీ ప్రకారం కనీస వేతనం రూ.30 వేలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తింపజేస్తున్న విధంగా రెండు డీఏలు అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ఆశా వర్కర్లకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల శ్రమను ప్రభుత్వం గుర్తించి వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని నాయకులు కోరారు. ఆశా వర్కర్ల సమస్యలపై ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని కడారి నాగరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దేవాలయంపై దాడిని ఖండించిన బీజేపీ నేత రాజిరెడ్డి.. దోషులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి





నర్సాపూర్, నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో స్వామివారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనను బీజేపీ ఎండోమెంట్ సెల్ మెదక్ జిల్లా జాయింట్ కన్వీనర్, హనుమాన్ సేన నాయకుడు రాజిరెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన దేవాలయాన్ని సందర్శించి ఘటన జరిగిన తీరును పరిశీలించారు. దేవాలయంలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను పోలీసులు వెంటనే గుర్తించి అరెస్టు చేయడంతో పాటు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మారిన తర్వాత దేవాలయాలపై దాడులు పెరిగాయని ఆరోపించారు. దేవాలయాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. విశ్వకర్మలకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటానని స్పష్టం చేశారు. కులాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి హిందువు దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ స్పందించాలని, ఆలయాల పవిత్రతను కాపాడేందుకు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వర్కర్ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం



అందోల్, నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం నేరడిగుంట గ్రామ పంచాయతీ వర్కర్ పెద్దగొల్ల మల్లేశం తల్లి యాదమ్మ మృతి చెందడంతో సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ తరఫున బాధిత కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా యాదమ్మ మృతిపట్ల గ్రామ పంచాయతీ ప్రతినిధులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి గ్రామ పంచాయతీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. గ్రామ పంచాయతీ తరఫున అందించిన ఆర్థిక సహాయం కుటుంబానికి కొంతమేర ఊరటనిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈశ్వర్, వార్డు సభ్యులు బోయిని శంకర్, తుకాపురం పూజిత నవీన్, ఒగ్గు మల్లేశం, ఒగ్గు దేవరాజు, గున్నాల సంగమేశ్వర్ తదితరులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



వార్డుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత.. అభివృద్ధి నిరంతర ప్రక్రియ: ఎమ్మెల్యే చింత ప్రభాకర్

నవంబర్ 11 (సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్) సంగారెడ్డి పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అవసరమైన సౌకర్యాలను దశలవారీగా అందించేందుకు కృషి చేస్తున్నామని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డు సిద్ధార్థ నగర్ కాలనీలో రూ.5 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ప్రతి కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తగ్గడంతోపాటు కాలనీల్లో రహదారి సౌకర్యాలు మెరుగుపడతాయని అన్నారు. చేపట్టిన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత మున్సిపల్ అధికారులకు సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తూ సంగారెడ్డి పట్టణాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్, నక్క నాగరాజు గౌడ్, కౌన్సిలర్ నవీన్, జాఫర్, సురేష్, మున్సిపల్ అధికారులు, కాలనీ పెద్దలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతులకు న్యాయమైన పరిహారం అందించాలి

మెదక్, నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం న్యాయమైన పరిహారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలతో పాటు తూప్రాన్ మండలంలో చేపట్టనున్న భూసేకరణ ప్రక్రియపై కలెక్టరేట్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు అథారిటీ అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణకు సంబంధించిన భూముల వివరాలు, యాజమాన్య హక్కులు, రెవెన్యూ రికార్డులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన రైతులను గుర్తించాలని సూచించారు. భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, పరిహారం చెల్లింపులో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి గఫర్‌తో పాటు రీజినల్ రింగ్ రోడ్డు అథారిటీకి చెందిన సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం అందించాలి



మెదక్, నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): 765-D, 765-DG జాతీయ రహదారుల నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులు, భూ యజమానులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన నష్టపరిహారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జాతీయ రహదారుల శాఖ అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించిన కలెక్టర్, రామాయంపేట నుంచి సిద్దిపేట పరిధిలో చేపడుతున్న 765-D, 765-DG జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులు, భూ యజమానులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని సూచించారు. భూముల సర్వే, రెవెన్యూ రికార్డుల పరిశీలన పారదర్శకంగా నిర్వహించి, బాధితుల వివరాలను సమగ్రంగా సేకరించాలని ఆదేశించారు. భూములు కోల్పోతున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం న్యాయమైన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పరిహారం చెల్లింపులో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులతో పాటు భూములు కోల్పోతున్న రైతులు, భూ యజమానుల హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాతీయ రహదారుల శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్డ్ వేతనం కల్పించాలి



మెదక్, నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల ఫిక్స్డ్ వేతనం అమలు చేయడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, రూ.50 లక్షల ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్ల సంఘం నాయకులు మంగళవారం మెదక్ ఎమ్మెల్యే కార్యాలయంలో గంగాధర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి కే. నర్సమ్మ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ఆశా వర్కర్లు ప్రజారోగ్య సేవల్లో కీలకపాత్ర పోషిస్తున్నప్పటికీ ప్రభుత్వం ఫిక్స్డ్ వేతనాలు అమలు చేయకుండా కేవలం పారితోషికాలతోనే సరిపెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో మరణించిన ఆశా వర్కర్లకు కనీసం అంత్యక్రియల ఖర్చులు కూడా అందడం లేదని పేర్కొన్నారు. 2023లో నిర్వహించిన సమ్మె సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి నెలకు రూ.18 వేల వేతనం అమలు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కార కమిటీతో ప్రభుత్వం తక్షణమే చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నాయకులు కోరారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే 2026 డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి సావిత్రి, జిల్లా నాయకులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

మెదక్, నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హాస్టళ్లలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, వసతి సౌకర్యాలు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను తరచూ తనిఖీ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతి గృహాల్లో నిరంతర తాగునీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా తాగునీటి సమస్య ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే పరిష్కరించాలని సూచించారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం బోర్లు వేయాల్సిన అవసరం ఉన్న వసతి గృహాలకు సంబంధించి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే పంపించాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అధికారులు తరచూ హాస్టళ్లను సందర్శించి సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. అలాగే ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు, తాగునీటి ఇబ్బందులు తలెత్తే అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

భూ వివాదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు



రాయికోడ్ (సందేశం టైమ్స్ ప్రతినిధి): గ్రామాల్లో భూ వివాదాల కారణంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రాయికోడ్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ హెచ్చరించారు. భూ వివాదాల కారణంగా గొడవలు జరిగి శాంతిభద్రతలకు భంగం కలిగే అవకాశం ఉన్న సందర్భాల్లో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (BNSS)-2023 సెక్షన్ 126 ప్రకారం శాంతిభద్రతల పరిరక్షణకు బైండోవర్ చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. అలాగే భూమి లేదా నీటి వివాదాల కారణంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితుల్లో BNSS సెక్షన్ 164 ప్రకారం సంబంధిత ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. వివాదాల స్వభావాన్ని బట్టి భారతీయ న్యాయ సంహిత (BNS)-2023లోని సెక్షన్ 115 (గాయపరచడం), 324 (ఆస్తి ధ్వంసం), 329 (క్రిమినల్ ట్రెస్‌పాస్), 351 (క్రిమినల్ బెదిరింపులు) తదితర చట్టపరమైన నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు సంయమనం పాటిస్తూ గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని, భూ వివాదాల విషయంలో గొడవలకు దిగకుండా చట్టాన్ని గౌరవించాలని ఎస్‌హెచ్‌ఓ సూచించారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని గొడవలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, నేర స్వభావాన్ని బట్టి చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

సదాశివపేటలో వ్యాపారులతో ముచ్చటించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్.. నిత్యావసర ధరల పెరుగుదలతో వ్యాపారాలు మందగించాయని వ్యాపారుల ఆవేదన



నవంబర్ 11 (సందేశం టైమ్స్) సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ దీపావళి పండుగ సందర్భంగా సదాశివపేట పట్టణంలో పర్యటించి వివిధ వాణిజ్య, వ్యాపార సంస్థల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని వ్యాపారులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో పర్యటిస్తూ దుకాణ యజమానులు, వ్యాపారులను ఆప్యాయంగా పలకరించి వ్యాపారాలు ఎలా కొనసాగుతున్నాయి, మార్కెట్ పరిస్థితులు ఎలా ఉన్నాయి, వినియోగదారుల కొనుగోలు శక్తి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యాపారులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువస్తూ నిత్యావసర సరుకుల ధరలు గణనీయంగా పెరగడంతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరిగిందని, దాని ప్రభావం వ్యాపారాలపై కూడా పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో కొనుగోళ్లు తగ్గిపోయాయని, ప్రజల చేతుల్లో డబ్బులు లేక చిన్నచిన్న వ్యాపారాలు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో నిత్యావసర ధరల పెరుగుదలతో పాటు వివిధ రంగాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మార్కెట్‌లో వ్యాపార లావాదేవీలు ఆశించిన స్థాయిలో సాగడం లేదని వ్యాపారులు తమ అభిప్రాయాలను ఎమ్మెల్యేకు వెల్లడించారు. ఎమ్మెల్యే వెంట బసంతి, ర్యాగల్ల అశోక్, మల్లికార్జున సుధాకర్, బోనగిరి సంగమేష్, నిజాంపురం రవి అశోక్, భువనగిరి చందర్, కోర్టుకే విశ్వనాథ్ సంతోష్, సారపు శ్రీనివాస్, కిష్టప్ప సేతు, మొట్లకుంట నారాయణ రవి, జీర్లపల్లి వెంకన్న, సంగారెడ్డి పేట మధుసూదన్, గాజుల కృష్ణ, సింగారం జగన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దిద్దిగే నగేష్, చీల మల్లన్న, మల్లికార్జున వంశీ, సంక్షయ్ గౌడ్, జగదీష్, చింత గోపాల్, అంజయ్య, నాగుల విజయ్, వీరేశం, కలీం పటేల్ తదితరులు పాల్గొన్నారు.



పొగమంచులో ప్రయాణం ప్రమాదకరం.. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దు

సంగారెడ్డి, నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): చలికాలంలో దట్టమైన పొగమంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రజలు వీలైనంత వరకు పొగమంచు సమయంలో ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. శీతాకాలంలో ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో రహదారులపై దట్టమైన పొగమంచు ఏర్పడి ఎదురుగా వచ్చే వాహనాలు సైతం స్పష్టంగా కనిపించని పరిస్థితులు ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా తెల్లవారుజామున నుంచి ఉదయం 8 గంటల వరకు పొగమంచు తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనాల లైట్లు వేసినప్పటికీ కొంత దూరంలో ఉన్న వాహనాలు స్పష్టంగా కనిపించవని, ఇలాంటి పరిస్థితుల్లో అధిక వేగంతో ప్రయాణించడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. పొగమంచులో అకస్మాత్తుగా బ్రేకులు వేయడం వల్ల వాహనాలు అదుపుతప్పి బోల్తా పడటం, ముందు వెళ్తున్న లేదా ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొట్టడం వంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వాహనదారులు వేగాన్ని తగ్గించి, ముందు వెళ్తున్న వాహనానికి తగినంత దూరం పాటిస్తూ జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు హెడ్‌లైట్లు, ఇండికేటర్లు తప్పనిసరిగా వినియోగించాలని, పొగమంచు సమయంలో లో బీమ్ లైట్లు ఉపయోగించాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. ప్రయాణంలో తొందరపాటు వద్దని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని, మీ భద్రతే మీ కుటుంబానికి భరోసా అని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



కృష్ణా జలాల్లో తెలంగాణ న్యాయమైన వాటా సాధించాలి.. సుప్రీంకోర్టులో సమర్థంగా వాదనలు వినిపించాలి: సీఎం రేవంత్ రెడ్డి

నవంబర్ 11 (సందేశం టైమ్స్) కృష్ణా నదీ జలాల పంపిణీలో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను సాధించేందుకు సుప్రీంకోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌తో వివాదం ఉన్న అన్ని అంశాలకు సంబంధించి అవసరమైన ఆధారాలు, పూర్తి వివరాలను న్యాయస్థానం ముందు సమర్పించాలని సూచించారు. ఈ నెల 18వ తేదీ తర్వాత సుప్రీంకోర్టులో కృష్ణా జలాల వివాదానికి సంబంధించిన కేసు విచారణకు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో న్యాయ నిపుణులతో చర్చించి తదుపరి కార్యాచరణను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ సంస్థ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సి.ఎస్. వైద్యనాథన్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పనులు వేగవంతం చేయాలి,డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే నిర్ణయించిన విధంగా ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి, అచ్చంపేట పథకాలకు నీటిని అందించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ రెండు పథకాలకు అవసరమైన మొత్తం 0.6 టీఎంసీల నీటిని నార్లాపూర్ నుంచి ఏదుల వరకు తరలించే ప్రక్రియలో ఎలాంటి అడ్డంకులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నీటిని తరలించేందుకు ఎక్కడ టన్నెళ్లు నిర్మించాలి, ఎక్కడ కాలువలు ఏర్పాటు చేయాలనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని, దానికి అనుగుణంగా పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు.కాళేశ్వరం అదనపు టీఎంసీ పనులపై తొందరపాటు వద్దు,కాళేశ్వరం ప్రాజెక్టులో అదనపు టీఎంసీ సామర్థ్యానికి సంబంధించిన పనుల విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి అధికారులను హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి బాధ్యతాయుతంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న రెండు టీఎంసీల నీటిని తరలించే సామర్థ్యాన్ని కూడా పూర్తిస్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితులు ఉన్నాయని, అలాంటప్పుడు అదనపు టీఎంసీ పనులపై ముందస్తు సాంకేతిక పరిశీలన లేకుండా ముందుకు వెళ్లడం సరికాదని స్పష్టం చేశారు.అదనపు పనులకు సంబంధించి ముందుగా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని సమీక్షించాలని, అనంతరం భూసేకరణకు సంబంధించిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నుంచి అవసరమైన అన్ని అనుమతులు పొందడంతోపాటు సాంకేతిక అంశాలను పరిశీలించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. న్యాయపరమైన అంశాలు, సాంకేతిక అనుమతులు, భూసేకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాతే తదుపరి పనులపై నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడటంతోపాటు రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లడం, పెండింగ్ పనులను పూర్తి చేయడం, ప్రజలకు సాగునీటి ప్రయోజనాలు అందించడం లక్ష్యంగా నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు.



అండాల సేకరణ అక్రమ దందాపై సర్కారు ఉక్కుపాదం.. ఏడు ఆసుపత్రుల్లో 13 ఉల్లంఘనలు గుర్తింపు

నవంబర్ 11 (సందేశం టైమ్స్) మహిళల నుంచి అండాల సేకరణ పేరుతో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఐవీఎఫ్ కేంద్రాలు, ఆసుపత్రులు, వైద్యులు, మధ్యవర్తులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్టీ) కేంద్రాల్లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. రాష్ట్రంలో గుర్తించిన మొత్తం 44 ఏఆర్టీ కేంద్రాలకు గాను ఇప్పటివరకు 27 కేంద్రాల్లో తనిఖీలు పూర్తయ్యాయి. ఈ తనిఖీల్లో ఏడు ఆసుపత్రుల్లో మొత్తం 13 నిబంధనల ఉల్లంఘనలు గుర్తించగా, సంబంధిత ఆసుపత్రుల యాజమాన్యాలకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేశారు.మిగిలిన ఏఆర్టీ కేంద్రాల్లోనూ తనిఖీలు కొనసాగుతున్నాయని వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటివరకు 31 మంది మహిళలను గుర్తించినట్లు పేర్కొంది. అండాల సేకరణ ప్రక్రియలో వైద్యులు, ఐవీఎఫ్ కేంద్రాలు, మధ్యవర్తుల పాత్రపై అధికారులు లోతుగా విచారణ జరుపుతున్నారు. పోలీసుల స్వాధీనంలో ఉన్న రికార్డులు, జాతీయ ఏఆర్టీ అండ్ సరోగసీ రిజిస్ట్రీ నుంచి అందే సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నారు.ఈ అక్రమ వ్యవహారంపై పూర్తి స్థాయిలో వివరాలు సేకరించేందుకు నవంబర్ 6న తెలంగాణ వైద్య అధికారులు న్యూఢిల్లీలోని నేషనల్ ఏఆర్టీ అండ్ సరోగసీ రిజిస్ట్రీని సందర్శించారు. రాష్ట్రంలో నమోదైన ఏఆర్టీ కేంద్రాలు, ఏఆర్టీ బ్యాంకులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందించాలని కోరారు. దీనిపై స్పందించిన నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) అధికారులు తెలంగాణకు సంబంధించిన సమాచారాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. ఆ వివరాలు అందిన తర్వాత రాష్ట్రంలోని కేంద్రాల రిజిస్ట్రేషన్, కార్యకలాపాలు, నిబంధనల అమలుపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (రెగ్యులేషన్) చట్టం-2021 ప్రకారం మహిళల నుంచి అండాలను సేకరించే ప్రక్రియ నిర్దేశిత చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగానే జరగాలి. చట్టానికి విరుద్ధంగా అండాల సేకరణకు పాల్పడటం శిక్షార్హమైన నేరమని వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. రాష్ట్రంలోని అన్ని ఏఆర్టీ క్లినిక్‌లు, ఏఆర్టీ బ్యాంకులు తప్పనిసరిగా చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ పొందడంతోపాటు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని హెచ్చరించింది.ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని కొందరు మధ్యవర్తులు మహిళలకు డబ్బు ఆశ చూపిస్తూ అక్రమ వైద్య విధానాల వైపు ప్రలోభపెట్టే అవకాశాలున్నందున మహిళలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ సూచించింది. మధ్యవర్తుల మాయమాటలు, ఆర్థిక ప్రలోభాలకు గురై తమ ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టుకోవద్దని విజ్ఞప్తి చేసింది. ఇలాంటి అక్రమ కార్యకలాపాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు గుర్తిస్తే సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించింది. మహిళల ఆరోగ్యం, భద్రతకు భంగం కలిగించే అక్రమ వైద్య కార్యకలాపాలపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది.— వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం, జాతీయ ఆరోగ్య మిషన్, తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటన ఆధారంగా.

రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు.. పాతర్లపాడులో పూరిగుడిసెకు నిప్పంటుకుంటుందేమోనన్న భయం!



ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాక నిరుపేద కుటుంబం ఆవేదన.. టపాసుల నిప్పురవ్వల భయంతో చలిలోనూ రాత్రంతా గుడిసెకు కాపలా

నవంబర్ 11 (సందేశం టైమ్స్) రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి పండుగ సంబరాలు అంబరాన్నంటుతుంటే.. ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో మాత్రం ఓ నిరుపేద కుటుంబం పూరిగుడిసెలో భయంభయంగా కాలం వెళ్లదీస్తోంది. ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇల్లు తమకు మంజూరు కాకపోవడంతో సొంతింటి కల నెరవేరక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామానికి చెందిన అల్లిక మునయ్య కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. దీపావళి సందర్భంగా గ్రామంలో టపాసుల మోతలు వినిపిస్తుంటే, ఎక్కడ నిప్పురవ్వలు తమ పూరిగుడిసెపై పడి ఇల్లు అగ్నికి ఆహుతవుతుందోనని కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ముఖ్యంగా తీవ్రమైన చలిని సైతం లెక్కచేయకుండా మునయ్య తండ్రి రాత్రంతా నిద్రపోకుండా గుడిసెకు కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని మునయ్య కన్నీటిపర్యంతమయ్యారు. ఇతరుల ఇళ్లలో పండుగ వెలుగులు కనిపిస్తుంటే తమ కుటుంబం మాత్రం గుడిసె కాలిపోతుందేమోనన్న భయంతో ప్రశాంతంగా దీపావళి జరుపుకోలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

సెంటు భూమి కూడా లేదు.. అయినా ఇందిరమ్మ ఇల్లు రాలేదా?

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందన్న ఆశతో తమ కుటుంబం ఎంతో ఎదురుచూసిందని అల్లిక మునయ్య తెలిపారు. మొదటి విడతలోనే తమకు ఇల్లు మంజూరవుతుందని ఆశించామని, అయితే లబ్ధిదారుల జాబితాలో తమ పేరు లేకపోవడంతో నిరాశకు గురయ్యామని పేర్కొన్నారు. తమకు కనీసం సెంటు భూమి కూడా లేదని, సొంత ఇల్లు కూడా లేని తమలాంటి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఎందుకు మంజూరు కాలేదని ప్రశ్నించారు. మరోవైపు వ్యవసాయ భూములు ఉన్నవారికి, ఇప్పటికే ఇళ్లు ఉన్నవారికి కూడా ఇళ్లు మంజూరైనట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే తమలాంటి నిరుపేద కుటుంబాలను కూడా అధికారులు గుర్తించి న్యాయం చేయాలని కోరారు.

అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో నిజమైన అర్హులకు పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మునయ్య కుటుంబం విజ్ఞప్తి చేస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పాతర్లపాడు గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి తమ కుటుంబ ఆర్థిక పరిస్థితిని, నివాస స్థితిగతులను పరిశీలించాలని కోరుతున్నారు. అర్హతలను పరిగణనలోకి తీసుకొని ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను అల్లిక మునయ్య వేడుకున్నారు. దీపావళి పండుగ వేళ వెలుగుల మధ్య వెలుగుచూసిన ఈ నిరుపేద కుటుంబం ఆవేదనపై అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.



సంగారెడ్డి పట్టణ అభివృద్ధికి పెద్దపీట.. రూ.55 లక్షలతో సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం

నవంబర్ 11 (సందేశం టైమ్స్ తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్): సంగారెడ్డి పట్టణంలోని పలు వార్డుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యంగా చేపట్టిన పనులకు మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్ శ్రీకారం చుట్టారు. పట్టణంలోని 9వ వార్డు సప్తగిరి కాలనీలో రూ.45 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను, 35వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రారంభించిన పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీలత శ్రీశైలం, నర్సమ్మ ప్రసాద్, సంగీత మహేష్, సతీష్ రెడ్డి, వంశీ, శైలేష్ రెడ్డి, రవి నాయక్, కాంగ్రెస్ నాయకులు సురేష్, కిరణ్, రమేష్‌తో పాటు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగుల సంబరాలు.. నిరుపేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం: కాంగ్రెస్ నాయకులు

నవంబర్ 11 (సందేశం టైమ్స్ తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపాలిటీ కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు దీపావళి సంబరాలు నిర్వహించారు. జిన్నారం 18వ వార్డు కౌన్సిలర్ ఎర్రవల్లి దీనా ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు కృషి చేస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు అందేలా తమ వంతు ప్రయత్నం కొనసాగిస్తామని, ఇల్లు లేదని ఏ ఒక్క పేద కుటుంబం ఆందోళన చెందకుండా ప్రభుత్వానికి నివేదిక అందించి అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకరయ్య, గోకర వెంకటేష్, పల్నాటి భాస్కర్, యనగండ్ల నరేందర్, వడ్ల నరేష్, అనిల్, లాలు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవీన ఓణీల వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన లింగాల కమల్ రాజు



నవంబర్ 11 (సందేశం టైమ్స్) ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ రైల్వే కాలనీలో కోపూరి నవీన్, కళ్యాణి దంపతుల కుమార్తె నవీన ఓణీల వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి మాజీ ఎమ్మెల్యే లింగాల కమల్ రాజు ముఖ్య అతిథిగా హాజరై చిన్నారి నవీనను ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చింతకాని మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రస్తుత మరియు మాజీ సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని వేడుకను సందడిగా నిర్వహించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్యం.. పీఎం రహత్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి: నర్సాపూర్ ఎస్ఐ రంజిత్ రెడ్డి



నర్సాపూర్, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్స ఆలస్యం కాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రహత్ పథకం ద్వారా గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్స పొందవచ్చని నర్సాపూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ రెడ్డి తెలిపారు. ఈ పథకం కింద ప్రమాదం జరిగిన తేదీ నుంచి గరిష్ఠంగా ఏడు రోజుల వరకు వైద్య చికిత్స పొందే అవకాశం ఉందని, బాధితుల ఆదాయంతో సంబంధం లేకుండా పథకం నిబంధనల ప్రకారం అర్హులైన వారికి ఈ సదుపాయం వర్తిస్తుందని వివరించారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, పట్టణ, గ్రామీణ రహదారులపై జరిగే మోటారు వాహన ప్రమాదాల్లో గాయపడిన వారికి గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సహాయం కోసం 112కు ఫోన్ చేయాలని, క్షతగాత్రులను వీలైనంత త్వరగా సమీపంలోని పీఎం రహత్ పథకం పరిధిలోని గుర్తింపు పొందిన ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఆసుపత్రి సిబ్బందికి పీఎం రహత్ పథకం కింద వైద్య చికిత్స అందించాలని తెలియజేయాలని కోరారు. రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, డబ్బుల సమస్యతో ఎవరూ వైద్య చికిత్సకు దూరం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామ ప్రజలు, వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారాన్ని ప్రచారం చేయాలని ఎస్ఐ రంజిత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరి అప్రమత్తత మరొకరి ప్రాణాలను కాపాడగలదని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.



వెలుగుమట్ల మోడల్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి.. నవంబర్ నెలాఖరుకు అన్ని పనులు పూర్తి కావాలి: కలెక్టర్ దివాకర టి.ఎస్

నవంబర్ 11 (సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇంచార్జ్ శెట్టి సురేష్) ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని వెలుగుమట్ల మోడల్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పాటు మౌలిక సదుపాయాల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. ఖమ్మం నగరపాలక సంస్థ 15వ డివిజన్ పరిధిలోని వెలుగుమట్ల మోడల్ కాలనీని ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించి ఇళ్ల నిర్మాణాల పురోగతిని, అంతర్గత రహదారులు, డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణాల ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. కాలనీలో మొత్తం 300 ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు లభించిందని, క్షేత్రస్థాయి నివేదిక ప్రకారం ఇప్పటివరకు 22 ఇళ్ల నిర్మాణాలు పూర్తయి ఫినిషింగ్ దశకు చేరుకున్నాయని తెలిపారు. మరో 119 ఇళ్లకు స్లాబ్ పనులు పూర్తయ్యాయని, 59 ఇళ్లు రూఫ్ లెవల్‌లో ఉండగా, 98 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయని వివరించారు. మిగిలిన నిర్మాణ పనులను కూడా వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

లబ్ధిదారుల ఖాతాల్లో ప్రతి సోమవారం నిధుల జమ

ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా నిర్మాణ దశను బట్టి ప్రతి సోమవారం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం నిధులు జమ చేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు వివిధ నిర్మాణ దశల్లో ఉన్న 205 ఇళ్లకు సంబంధించి చెల్లింపులు పూర్తయ్యాయని, మిగిలిన పెండింగ్ బిల్లులను కూడా త్వరితగతిన విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నిర్మాణాల వేగాన్ని మరింత పెంచేందుకు 133 మంది లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు అందించినట్లు వెల్లడించారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకునేలా అధికారులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

రోడ్లు, డ్రైనేజీ, విద్యా, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

మోడల్ కాలనీలో నివసించే ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిర్మిస్తున్న బస్తీ దవాఖానా, ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. కాలనీలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణ పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయని, వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నవంబర్ నెలాఖరు నాటికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పాటు అన్ని మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేసి వెలుగుమట్ల మోడల్ కాలనీని ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ పర్యటనలో హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, డీఈ కె. జగ్రామ్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ డీఈ నవ్యజ్యోతి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచంద్ర, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పేరెంట్–టీచర్ సమావేశానికి హాజరై విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్న సర్పంచ్ బంజ లావణ్య రవి

వెల్దుర్తి, నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం శేరిల్లా గ్రామంలో నిర్వహించిన పేరెంట్–టీచర్ సమావేశానికి గ్రామ సర్పంచ్ బంజ లావణ్య రవి హాజరై విద్యార్థుల సమస్యలు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, ఉదయం అందించే అల్పాహారం తదితర అంశాలపై విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం ఎంతో ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అవసరమైన సౌకర్యాల గురించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో చర్చించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని సర్పంచ్ బంజ లావణ్య రవి తెలిపారు.



అనంతసాగర్‌లో నూతన గృహ ప్రవేశ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్...

నవంబర్ 11 (సందేశం టైమ్స్) తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ బి.సంగమేశ్వర్).సంగారెడ్డి జిల్లా అనంతసాగర్ గ్రామంలో కుమార్ నూతనంగా నిర్మించుకున్న ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుమార్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.అనంతరం గ్రామ సర్పంచ్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను సర్పంచ్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆత్మీయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సర్పంచ్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలు, స్థానిక పరిస్థితులపై నాయకులు పరస్పరం చర్చించుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చేయూత పింఛన్లు, రాజీవ్ యువ వికాసం పథకాలకు వెంటనే నిధులు మంజూరు చేయాలి



సంగారెడ్డి, నవంబర్ 11 (సందేశం టైమ్స్) మెదక్ జిల్లా ఇన్‌చార్జి అనిల్ కుమార్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేయూత పింఛన్లు, రాజీవ్ యువ వికాసం పథకాలకు నిధులు మంజూరు చేసి అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు, స్వయం ఉపాధి రుణాలు అందించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బీసీ సంక్షేమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టి పోరాటం కొనసాగిస్తామని ప్రభుగౌడ్ స్పష్టం చేశారు. జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పట్టోళ్ల మల్లికార్జున పాటిల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ప్రభుగౌడ్, ఉపాధ్యక్షుడు డి. కిష్టయ్య, ప్రధాన కార్యదర్శులు పార్వతి కృష్ణ, నాగరాణి, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. అంజనేయులు, ప్రధాన కార్యదర్శి జె. రాజేశ్వర్ స్వామి, కోశాధికారి సుధాకర్ గౌడ్, ఉపాధ్యక్షులు శ్రీధర్, మహేందర్, ముఖ్య సలహాదారు కరంజిత్ సింగ్, కార్యదర్శులు గౌలీశ్వర్, శ్రీనివాస్, ప్రవీణ్, మహేష్, సభ్యులు యాదగిరి, రవీందర్ పాల్గొన్నారు. అలాగే యూత్ కమిటీ అధ్యక్షుడు జావిద్, మహిళా కమిటీ అధ్యక్షురాలు మంజుల గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షురాలు మానస, కార్యదర్శి వీరమణి, సదాశివపేట మండల అధ్యక్షురాలు మౌనిక తదితరులు పాల్గొన్నారు.



పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజాప్రభుత్వం – శేరి వెంకట్ రెడ్డి, మొరబోయిన కృష్ణ

అందోల్, నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి) సంగారెడ్డి జిల్లా అందోల్ మండల్ లో పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మొరబోయిన కృష్ణ అన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి. దామోదర్ రాజనర్సింహా ఆదేశాల మేరకు ప్రభుత్వం నిర్వహిస్తున్న 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా ఆదివారం అందోల్ మండలం కంసాన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు చాకలి లక్ష్మి రవి నివాసంలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ముందు దీపాలు వెలిగించి, ఇంటికి ప్రత్యేక స్టిక్కర్ అంటించి, గ్రూప్ ఫొటోలు దిగారు. తమ సొంతింటిలో తొలిసారిగా దీపావళి పండుగ జరుపుకోవడం పట్ల లక్ష్మి రవి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శేరి వెంకట్ రెడ్డి, మొరబోయిన కృష్ణ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని, నూతన గృహాల్లో దీపాలు వెలిగించి పండుగ జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. పేదల జీవితాల్లో సంతోషం, భద్రత, కొత్త ఆశలు నింపడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారు కుటుంబ సభ్యులతో కలిసి దీపాలు వెలిగించి, టపాసులు కాల్చి దీపావళి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొని కుటుంబ సభ్యులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాలయ్య, వార్డు సభ్యులు వని రమాదేవి, దుర్గయ్య, మాజీ వార్డు సభ్యుడు మొరబోయిన లక్ష్మిదత్తు, నాయకులు మొరబోయిన ఈశ్వరయ్య, మన్నే దత్తయ్య, రామన్నగారి చంద్రయ్య, రామన్నగారి కిష్టయ్య, చాకలి యాదయ్య, చాకలి ఆశయ్య, చాకలి ఈశ్వర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

బస్సు ఎక్కే క్రమంలో ప్రమాదం.. వ్యక్తి కాళ్లపై నుంచి వెళ్లిన వెనుక చక్రాలు





మెదక్ , నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి) మెదక్ జిల్లా లో దుంపలకుంట ఎక్స్ రోడ్డు చౌరస్తా వద్ద బస్సు ఎక్కే క్రమంలో ఓ వ్యక్తి ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకుంది. మెదక్ నుంచి పటాన్‌చెరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వద్ద ప్రయాణికుడు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ క్రమంలో బస్సు వెనుక చక్రాలు అతని కాళ్లపై నుంచి వెళ్లడంతో కాళ్లు తీవ్రంగా నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు పెద్దగా కేకలు వేస్తూ బస్సును ఆపాలని డ్రైవర్‌ను హెచ్చరించినప్పటికీ డ్రైవర్ వెంటనే స్పందించకుండా ముందుకు వెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీంతో కొంతదూరం వెళ్లిన తర్వాత స్థానికులు బస్సును ఆపి డ్రైవర్‌ను నిలదీశారు. అనంతరం స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించగా, సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తితో పాటు బస్సు డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి జోగిపేటకు చెందినవాడిగా గుర్తించినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదానికి బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ప్రత్యక్ష సాక్షులు ఆరోపిస్తున్నారు.

MDR ఫౌండేషన్ కార్యాలయంలో ఘనంగా దీపావళి వేడుకలు



పటాన్‌చెరు, నవంబర్ 11 (సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరు పట్టణంలోని MDR ఫౌండేషన్ కార్యాలయంలో లక్ష్మీ పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, MDR ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ దీపావళి పండుగ చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆశ, ఆనందం, ప్రేమ, ఐకమత్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో పాటు సురక్షితంగా దీపావళి వేడుకలను జరుపుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాద్రి దేవేందర్ రాజు, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ముఖ్య సమావేశం.. హాజరుకానున్న జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డి, నవంబర్ 11(సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో ఈ నెల 11వ తేదీ బుధవారం సాయంత్రం 4 గంటలకు సంగారెడ్డి చౌరస్తాలోని పి.ఎస్.ఆర్. గార్డెన్స్‌లో ముఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు టీం జగ్గారెడ్డి వెల్లడించింది. ఈ సమావేశానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి పాల్గొననున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని టీం జగ్గారెడ్డి కోరింది.





రామకృష్ణాపురంలో ఎమ్మెస్ఎఫ్ గ్రామ కమిటీ ఎన్నిక.. అధ్యక్షుడిగా పగిడిపల్లి అభి ఏకగ్రీవ ఎన్నిక

చింతకాని, నవంబర్ 11 (సందేశం టైమ్స్ చింతకాని ప్రతినిధి): ఖమ్మం జిల్లా చింతకాని మండలం రామకృష్ణాపురం గ్రామంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎమ్మెస్ఎఫ్) గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. గ్రామంలోని పాత కాలనీలో గుంటి అరవింద్ అధ్యక్షతన, కొత్త కాలనీలో గద్దల మహేష్ అధ్యక్షతన జరిగిన సమావేశాలకు ఎమ్మెస్ఎఫ్ జిల్లా నాయకులు పగిడిపల్లి రవీంద్ర, చిర్రా ఉపేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెస్ఎఫ్ గుండెకాయగా నిలవాలని, పీడిత కులాల గొంతుకగా మారి అణగారిన వర్గాల విద్యార్థులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అవసరమైతే కృష్ణ మాదిగ స్ఫూర్తితో ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉండాలని అన్నారు. అనంతరం నిర్వహించిన గ్రామ కమిటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పగిడిపల్లి అభిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, కమిటీ సభ్యులుగా గుడిపాటి యశ్వంత్, గుర్రం రక్షిత, బొప్పి భార్గవి, గుంటి త్రివేన్, పగిడిపల్లి మాధవి, గుంటి శ్రీనివాస్, భరత్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ఎఫ్ మండల అధ్యక్షుడు నారపోగు నాగేంద్రబాబు, కుక్కల దిలీప్, గ్రామ పెద్దలు పగిడిపల్లి వసంతరావు, రాయలమీర స్వామి, బుర్ర జయరాజు, పగిడిపల్లి పెద్ద బాలస్వామి, సోదరుల నాగేంద్రం, గుర్రం లాలు, గుంటి హుస్సేన్‌తో పాటు యువజన సభ్యులు గుడిపాటి గోపి, పగిడిపల్లి సాయి తేజ, ఏంపంగి బాలకృష్ణ, పగిడిపల్లి తేజ, బుర్ర ప్రేమ్ కుమార్, గద్దల అశోక్, పగిడిపల్లి గోపి, గుడిపాటి అరవింద్, పగిడిపల్లి నాగమణి, పగిడిపల్లి వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేరబోయిన గూడెం ఇసుక రీచ్ అక్రమాలను వెంటనే అరికట్టాలి.. చిత్తలూరు గ్రామ ఇసుక రీచ్ కమిటీ డిమాండ్



సూర్యాపేట, నవంబర్ 11 (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): నాగారం మండలం పేరబోయిన గూడెం ఇసుక రీచ్‌లో జరుగుతున్న అక్రమాలను వెంటనే అరికట్టి, సూర్యాపేట జిల్లా పేరబోయిన గూడెం, నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామాల మధ్య ఇసుక రీచ్ సరిహద్దులను స్పష్టంగా నిర్ణయించాలని నల్లగొండ జిల్లా శాలిగౌరారం మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరు శంకర్ రెడ్డి, చిత్తలూరు గ్రామ సర్పంచ్ గిరగాని వెంకన్న, గ్రామ ఇసుక రీచ్ కమిటీ అధ్యక్షుడు భీమగాని వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు చిత్తలూరు గ్రామ ఇసుక రీచ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేరబోయిన గూడెం గ్రామానికి చెందిన కొందరు చిత్తలూరు గ్రామ సరిహద్దుల్లోకి వచ్చి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారని, దీనివల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గతంలో ఆర్డీఓ, మైనింగ్ శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేసినా పరిష్కారం లభించలేదని తెలిపారు. రెండు గ్రామాల మధ్య వివాదాలు మరింత తీవ్రరూపం దాల్చకుండా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ఇసుక రీచ్ సరిహద్దులను నిర్ణయించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తలూరు గ్రామ ఉపసర్పంచ్ యన్నమల్ల శంకర్, మాజీ సర్పంచ్ బొమ్మగాని రవి, కోఆప్షన్ సభ్యులు దాసరి దేవచిత్త, సుంకరి వినీత్, చిలువేరు కిరణ్, యర్ర లక్ష్మి, రాచమల్ల సైదమ్మ, శంభయ్య, తేలుకుంట్ల జయమ్మ, పీరనాయకం జ్యోతి, నరేష్‌తో పాటు చిత్తలూరు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా ఫిర్యాదులపై వేగంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలి.. జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్

సూర్యాపేట, నవంబర్ 11 (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బాధితులు అందించిన వినతులను పరిశీలించి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించాలని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు భరోసా కల్పించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన పోలీస్ సేవలు అందించడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రజల రక్షణ కోసం పోలీసు సిబ్బంది అనుక్షణం విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని, ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు దాడులకు పాల్పడకుండా ఇరు వర్గాలు పెద్దల సమక్షంలో సామరస్యపూర్వకంగా, చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్పీ స్పష్టం చేశారు.

సాయం చేయాలనే మంచి మనసుంటే కుల, మత, ప్రాంత భేదాలు అడ్డుకావు.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వం



సూర్యాపేట, నవంబర్ 11 (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): కుల, మత, ప్రాంత భేదాలు చూడకుండా ఆపదలో ఉన్నవారికి సాయం చేయాలనే మంచి మనసు ఉంటే చాలు, మానవత్వం ఎప్పుడూ మనిషిని ముందుండి నడిపిస్తుందని సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కార్తీక్ తన తల్లిదండ్రులతో కలిసి కారులో తెనాలి నుంచి హైదరాబాద్‌కు ప్రయాణిస్తుండగా, సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గంలోని బరాఖత్ గూడెం సమీపంలో జాతీయ రహదారిపై కారు మరమ్మతుకు గురై నిలిచిపోయింది. అదే మార్గంలో వెళ్తున్న సోమయ్య కంభంపాటి మొదట కారును గమనించినప్పటికీ, కొంతసేపటి తర్వాత తిరిగి అదే మార్గంలో వస్తున్న సమయంలో కారు ఇంకా అక్కడే నిలిచి ఉండటాన్ని గుర్తించి, వెళ్లి ఏమైందని అడిగి తెలుసుకున్నారు. కారు మరమ్మతుకు గురైందని వారు చెప్పడంతో కార్తీక్‌ను తన స్కూటీపై తీసుకెళ్లి సమీపంలోని మెకానిక్ షాపుల వద్ద ప్రయత్నించారు. ఆ సమయంలో మెకానిక్‌లు అందుబాటులో లేకపోవడంతో కోదాడలోని మెకానిక్‌కు ఫోన్ చేసి రప్పించారు. మెకానిక్ వచ్చి కారును కోదాడలోని గ్యారేజీకి తీసుకెళ్లగా, కారు మరమ్మతు పూర్తయ్యే వరకు సోమయ్య వారితోనే ఉండి, మరమ్మతు బిల్లును సైతం చెల్లించి, అనంతరం వారిని హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారి మార్గం వరకు తీసుకెళ్లి సురక్షితంగా పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు కార్తీక్‌తో గతంలో ఎలాంటి పరిచయం లేదని, కనీసం ముఖ పరిచయం కూడా లేకపోయినా ఆపదలో ఉన్నవారికి సాయం చేయాలనే ఆలోచనతో ముందుకు వచ్చానని తెలిపారు. నేటి సమాజంలో చాలామంది ఇతరుల సమస్యలను పట్టించుకోకుండా తమ పని తాము చూసుకుంటూ వెళ్లిపోతున్న పరిస్థితుల్లో, తోటి మనిషికి అవసరమైన సమయంలో అండగా నిలవడం ఎంతో ముఖ్యమని అన్నారు. మనిషి జీవితం ఎప్పుడు ఎలా ముగుస్తుందో ఎవరికీ తెలియదని, మనం చేయగలిగిన సాయాన్ని మాత్రం తప్పకుండా చేయాలని సూచించారు. సాయం పొందేవారు మనకు తెలిసినవారా, తెలియనివారా, మన ప్రాంతం వారా, ఇతర ప్రాంతాల వారా అనే భేదాలు చూడకుండా మానవత్వంతో స్పందించాలని, ఆశించకుండా చేసే సాయం ఏదో ఒక రూపంలో తిరిగి మనకే మంచిని కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ప్రజాసేవకుల సేవలకు గుర్తింపు ఇవ్వడం అభినందనీయం.. అవార్డు కార్యక్రమంపై మన్నే పోచయ్య ప్రశంసలు



మునిపల్లి, నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రజాసేవలో విశేష కృషి చేస్తున్న నాయకులను గుర్తించి సత్కరించేందుకు సంస్థ, దాని వ్యవస్థాపకులు ఒగ్గు సతీష్ సోదరులు నిర్వహిస్తున్న అవార్డుల కార్యక్రమం అభినందనీయమని సందేశం టైమ్స్ విలేకరి మన్నే పోచయ్య అన్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుల సేవలను గుర్తించి తగిన గౌరవం అందించే వేదికలు అరుదుగా ఉంటాయని, అలాంటి గొప్ప ఆలోచనతో అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ అవార్డుల ద్వారా ప్రజాసేవకులను సత్కరించడమే కాకుండా, మరింత బాధ్యతతో ప్రజలకు సేవ చేయాలనే స్ఫూర్తిని అందిస్తున్నారని తెలిపారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే నిజమైన నాయకత్వానికి నిదర్శనమని అన్నారు. ప్రజాక్షేత్రంలో పనిచేస్తున్న తమలాంటి వారికి ఈ కార్యక్రమం ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తుందని పేర్కొంటూ, కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంస్థకు, వ్యవస్థాపకులు ఒగ్గు సతీష్ సోదరులకు హృదయపూర్వక అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో మరెందరో ప్రజాసేవకులకు ఈ వేదిక ద్వారా గుర్తింపు, గౌరవం లభించాలని ఆకాంక్షించారు.



కాంగ్రెస్ కార్యకర్తలకే సంక్షేమ పథకాలా? అర్హులైన పేదలకు అన్యాయం చేయడం సిగ్గుచేటు: జడ్పీ మాజీ చైర్మన్

మధిర, నవంబర్ 11 (సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇంచార్జి): మధిర నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని, అర్హులైన పేదలకు రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని జడ్పీ మాజీ చైర్మన్ విమర్శించారు. మధిరలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో పేదలందరికీ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. ప్రస్తుతం మధిర ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలు తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దెందుకూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన ఒంటరి దళిత మహిళలకు సైతం కనీసం ఇళ్లు మంజూరు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కమిషన్లు రావనే ఉద్దేశంతోనే నిజమైన అర్హులకు ఇళ్లు కేటాయించడం లేదని ఆరోపించారు. ప్రజలకు అవసరం లేని ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం కేవలం కమీషన్ల కోసమే చేపడుతున్నారని విమర్శించారు. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గేదెల పంపిణీ కోసం ఒక్కో మహిళ నుంచి రూ.1,100 వసూలు చేశారని, ఆ డబ్బులు ఏమయ్యాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మళ్లీ ఒక్కొక్కరి నుంచి రూ.2,400 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మహిళలందరినీ కోటీశ్వరులను చేస్తామని హామీ ఇచ్చి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మహిళలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వంలో భట్టి విక్రమార్కతో పాటు ఆయన చుట్టూ తిరిగే కాంట్రాక్టర్లు మాత్రమే ప్రజాధనంతో కోటీశ్వరులయ్యారని ఆరోపించారు. మధిర పట్టణంలోని రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉందని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇక్కడి రహదారులను చూసి అసహ్యించుకుంటున్నారని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోందని స్పష్టం చేశారు.



ఎండిపోయిన వరి పంటలకు ఎకరాకు రూ.30 నుంచి 40 వేల పరిహారం అందించాలి.. మెదక్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి: తెలంగాణ రైతు రక్షణ సమితి

మెదక్, నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లాలో ఎండిపోయిన వరి పంటలకు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు నష్టపరిహారం అందించాలని, జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు అక్కమొల్ల మైసయ్య యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా కార్యవర్గ కమిటీ అధ్వర్యంలో మైసయ్య యాదవ్ అధ్యక్షతన కమిటీ సభ్యులు జిల్లాలోని ఎండిపోయిన వరి పంటలను, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించి రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి రైతుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మైసయ్య యాదవ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో మొత్తం 21 మండలాలు ఉండగా కేవలం మనోహరాబాద్ మండలాన్ని మాత్రమే కరువు మండలంగా ప్రకటించి మిగతా 20 మండలాలను విస్మరించడం వల్ల ఆయా ప్రాంతాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన నష్టపరిహారం, సబ్సిడీలు, ఇతర సహాయక పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని, యాసంగిలో వరి పంటకు బదులుగా ఇతర పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు అందించాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్‌ను కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అవకతవకలను అరికట్టి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు మైసయ్య యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మిరియాల చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు అశోక్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయిని రమేష్ యాదవ్, ముఖ్య సలహాదారు కొండ ఎల్లం యాదవ్, జిల్లా కార్యదర్శి నరేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పరశురాం యాదవ్, పి. మల్లేష్, సిద్దిరాములు యాదవ్, యేసయ్, వంశీకృష్ణ, రైతు నాయకులు తదితరులు పాల్గొన్నారు. జై కిసాన్.. జై జవాన్.. జై కిసాన్!



చదువుకో తెలంగాణ పోస్టర్ ఆవిష్కరణ.. ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.10 వేల ప్రోత్సాహక చెక్కుల అందజేత

అర్వపల్లి, నవంబర్ 11 (సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక – సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): శ్రీరామ్ గ్రూప్ ఆధ్వర్యంలో వరంగల్, ఖమ్మం, సూర్యాపేట మూడు బ్రాంచ్‌ల మేనేజర్ల సమక్షంలో చదువుకో తెలంగాణ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ గంగుల సతీష్ కుమార్, ఖమ్మం డివిజన్ మేనేజర్ రాజబోయిన భరత్ కుమార్, సూర్యాపేట బ్రాంచ్ మేనేజర్ బందెల భరత్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేష్ ముఖ్య అతిథులుగా హాజరై చదువుకో తెలంగాణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సూర్యాపేట జిల్లా అర్వపల్లి పాఠశాలలో మండల స్థాయిలో ప్రతిభ కనబరిచి టాపర్లుగా నిలిచిన మొహమ్మద్ అస్లాం భాష సిద్ధిక్, పొట్టేపాక శ్రావ్య విద్యార్థులకు ప్రోత్సాహకంగా రూ.10 వేల విలువైన చెక్కులను గంగుల సతీష్ కుమార్, రాజబోయిన భరత్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థుల్లో చదువుపట్ల ఆసక్తిని పెంపొందిస్తూ, ప్రతిభావంతులను ప్రోత్సహించి వారి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పాటునందిస్తున్న శ్రీరామ్ గ్రూప్ సేవలు అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. చదువుకో తెలంగాణ కార్యక్రమం ద్వారా విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని, ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ సూర్యాపేట డెవలప్‌మెంట్ ఆఫీసర్లు కుంభం సురేందర్, రాజబోయిన రాజు, సేల్స్ మేనేజర్ యుగంధర్, సేల్స్ ఆఫీసర్ గోళ్ల శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై ధాన్యం ఆరబెట్టవద్దు.. ప్రమాదాలకు తావివ్వొద్దు,సురక్షిత ప్రదేశాలను వినియోగించుకోవాలి: జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



మెదక్, నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రహదారులపై వరి ధాన్యాన్ని ఆరబెట్టడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ హెచ్చరించారు. రైతులు ధాన్యాన్ని రహదారులపై కాకుండా గ్రామ పంచాయతీ ప్రాంగణాలు, ఖాళీ స్థలాలు లేదా ఇతర సురక్షిత ప్రదేశాల్లో ఆరబెట్టుకోవాలని సూచించారు. రహదారులపై ధాన్యం ఆరబెట్టడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ధాన్యం చుట్టూ రాళ్లు పెట్టడం, నల్లటి పాలిథిన్ కవర్లతో కప్పడం వల్ల రాత్రివేళల్లో అవి వాహనదారులకు సరిగా కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. రైతులు చిన్నపాటి నిర్లక్ష్యానికి కూడా తావివ్వకుండా తమ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాల రక్షణను దృష్టిలో ఉంచుకోవాలని ఎస్పీ కోరారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రమాదాల నివారణకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.



బెక్కెం వేణుగోపాల్ రెడ్డికి పీసీసీ అధికార ప్రతినిధి పదవి.. నిబద్ధతగల కాంగ్రెస్ కార్యకర్తకు దక్కిన గౌరవం!



హైదరాబాద్, నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధికార ప్రతినిధిగా బెక్కెం వేణుగోపాల్ రెడ్డి నియమితులవడం పార్టీ పట్ల నిబద్ధతతో, అంకితభావంతో పనిచేసిన నాయకుడికి దక్కిన సముచిత గుర్తింపుగా సామాజిక, రాజకీయ విశ్లేషకులు నరేందర్ ఆమూరి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల పట్ల విశ్వాసంతో, వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకులకు గుర్తింపు లభించడం కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతుందని అన్నారు. పీసీసీ అధికార ప్రతినిధి పదవి ఎంతో కీలకమైన బాధ్యతతో కూడుకున్నదని, పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రభుత్వ నిర్ణయాలను వివరించడం, రాజకీయ పరిణామాలపై పార్టీ వైఖరిని స్పష్టంగా వినిపించడం, ప్రతిపక్షాల విమర్శలకు సమాధానమివ్వడం వంటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బెక్కెం వేణుగోపాల్ రెడ్డి తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించి రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా రానున్న నామినేటెడ్ కార్పొరేషన్ పదవుల నియామకాల్లోనూ పార్టీ కోసం కష్టకాలంలో పనిచేసిన నాయకులకు సముచిత ప్రాధాన్యత కల్పించాలని, బెక్కెం వేణుగోపాల్ రెడ్డికి సైతం మరిన్ని కీలక బాధ్యతలు అప్పగించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీని నమ్ముకుని నిబద్ధతతో పనిచేసే నాయకులను అధిష్టానం గుర్తించి తగిన అవకాశాలు కల్పించినప్పుడే క్షేత్రస్థాయి కార్యకర్తల్లో విశ్వాసం, ఉత్సాహం మరింత పెరుగుతాయని సామాజిక, రాజకీయ విశ్లేషకులు నరేందర్ ఆమూరి తెలిపారు.

ఓటరు జాబితాలో పేరు లేకపోయినా.. అర్హులకు మరో అవకాశం

మెదక్, నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR)-2026లో భాగంగా గైర్హాజరు, వలస, మరణం, డూప్లికేట్ తదితర కారణాలతో ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించినట్లు మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. మెదక్ పట్టణంలోని దయారాలో ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ఓటర్లు తమ వివరాలతో కూడిన ఎలక్టోరల్ ఫారాలను పూర్తిచేసి సంబంధిత బూత్ స్థాయి అధికారి (BLO)కి వెంటనే సమర్పించాలని సూచించారు. గైర్హాజరు, వలస, మరణం, డూప్లికేట్ తదితర కారణాలతో గుర్తించినప్పటికీ ఫారాలు అందని ఓటర్ల బూత్‌వారీ జాబితాలను పోలింగ్ కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థల కార్యాలయాలు, ఇతర ముఖ్యమైన బహిరంగ ప్రదేశాల్లో మరోసారి ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. ఓటరు నివాసం మారకుండా అదే ప్రాంతంలో కొనసాగుతున్నట్లయితే, గతంలో ఫారం సమర్పించకపోవడానికి గల కారణాలను వివరిస్తూ అనుబంధం-బి (Annexure-B) ప్రకటనతో పాటు పూర్తిచేసి సంతకం చేసిన ఫారాన్ని సంబంధిత ERO/AERO/BLOకు స్వయంగా లేదా కుటుంబంలోని వయోజన సభ్యుల ద్వారా అందజేయవచ్చని తెలిపారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, అదే సమయంలో డూప్లికేట్ ఓటరు నమోదుకు అవకాశం లేకుండా ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ–మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.